క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలి



వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థులు ప్రతి ఏటా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలని స్కూలు హెచ్‌ఎం రాంచందర్ పేర్కొన్నారు. పడగల్ హైస్కూలు నుంచి ఈ ఏడాది బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన అలోక, కిరణ్, సుశాంత్ లను శుక్రవారం పాఠశాలలో శాలువా మెమెంటోతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్సెస్సీ చదువుతున్న విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీటీసీ మీసాల శ్యాంరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హుస్సేమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



నందిపేట్(ఆర్మూర్): జిల్లా అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలో నందిపేట మండల కేంద్రానికి చెందిన ఉజ్వల పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. అండర్ 8 విభాగంలో హర్షిత బంగారు, కార్తిక్ రజత పతకాలు సాధించారు. అలాగే అండర్ 10 విభాగంలో హర్షిని బంగారు, అండర్ 12 విభాగంలో సీహెచ్ హర్షిని రజత, అండర్ 16 విభాగంలో అబ్దుల్ గఫార్ జావిలిన్ త్రోలో బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలయాజమాన్యం అరుణ్, వ్యాయమ ఉపాధ్యాయులు వికాస్, నవీన్ ఉపాధ్యాయులు అభినందించారు.

రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



రెంజల్(బోధన్): రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆసీయా ఫాతీమా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేసిన శ్రావణ్‌కుమార్ అనారోగ్య కారణాలతో ఈ నెల 31వ తేదీ వరకు సెలవుపై వెళ్లగా ఆయన స్థానంలో వర్ని డీటీగా పని చేస్తున్న మమతను రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అధికారులు నియమించారు. శ్రావణ్‌కుమార్ మరో 15 రోజుల వరకు సెలవును పొడిగించుకోవడంతో ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేస్తున్న మమత పని ఒత్తిడితో పాత స్థానంలోకి వెళ్లింది. చందూర్ మండలంలో డీటీగా పని చేస్తున్న సాఫీయా ఫాతీమాను రెంజల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

ఆర్థిక సహాయం అందజేత



వేల్పూర్: మండల కేంద్రానికి చెందిన టికాయి బాలేష్ కూతురు చికిత్స కోసం ఇజ్రాయెల్‌లో ఉంటున్న ప్రవాస వేల్పూర్ వాసులు సమకూర్చిన రూ. 75 వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబీకులకు శుక్రవారం అందజేశారు. బాలేష్ కూతురుకు వైద్యం కోసం రూ. 10 లక్షలు అవసరమని తెలుపగా తమవంతుగా వేల్పూర్ ఇజ్రాయెల్ వాసులు ఆర్థిక సహాయం పంపించారు. వీరితో పాటు వేల్పూర్‌లో వీర సావర్కర్ యూత్ తరపును రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పింఛన్‌దారుల మహాగర్జన సభ విజయవంతం చేయాలి



బోధన్: కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు నూతన పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 13న హైదరాబాద్‌లో లాల్‌బహదూర్ స్టేడియంలో తలపెట్టిన మహాగర్జన సభకు తరలి రావాలని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల జాతీయ పోరాట సమితి) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు.వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మహాగర్జన సభను నిర్వహించనున్నామని వెల్లడించారు.ఈ నెల 5న ఆర్మూర్ పట్టణ కేంద్రానికి మందక్రిష్ణ మాదిగ జిల్లా సన్నాహక సదస్సుకు రానున్నారని తెలిపారు.ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య,మండల నాయకులు మారుతి, సావిత్రి, నాగభూషణం, తాడెం అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు | పర్యావరణహితం..

- జైతాపూర్‌లో ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు శిక్షణ

బోధన్ : ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ సాగు పర్యావరణహితమని, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రత్యక్షంగా తయారు చేసుకునే అవకాశం కలుగుతుందని జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా మాస్టర్ రైతు,ఆదర్శ రైతు పాపారావు అన్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం ద్వారా ఆత్మా (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) జిల్లా విభాగం ఆధ్వర్యంలో కృషి సఖి యోజన పథకం కింద ఎంపిక చేసిన 15 మండలాల మహిళలకు ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో పాపారావు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు పాపారావు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, పురుగు మందుల తయారీ, వాటి వినియోగంపై వివరించారు. ఘన జీవామృతం, గోకృపామృతం, వేపగింజ కషాయం తయారీ పద్ధతులను తెలిపారు. భావితరం కోసం నేల, నీరు కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. ఆత్మా జిల్లా ప్రాజెక్టు డిప్యూటీ మేనేజర్ దైవ గ్లోరి, ఆత్మా బీటీఎం భరత్‌కుమార్, ఏవో సిద్ధిరామేశ్వర్, మహిళ రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి సేద్యంపై మహిళలకు వివరిస్తున్న రైతు పాపారావు

కాశీ క్షేత్రంతో బోధన్‌కు ఏళ్ల బంధం



శివలింగ పూజలో పాల్గొన్న వీరశైవ సమాజ్ ప్రతినిధులు



ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్న వీరశైవ సమాజ్ మహిళలు

- కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామీజీ
- బోధన్‌లో వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో శ్రావణమాస సంచార అనుష్టాన ఆధ్యాత్మిక వేడుకలు

బోధన్: కాశీ క్షేత్రంతో బోధన్‌కు ఏళ్ల బంధం ఉందని కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామీజీ అన్నారు. వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ ఆధ్వర్యంలో పవిత్ర శ్రావణ మాస సంచార అనుష్టాన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని శుక్రవారం బోధన్‌లోని ఏకచక్రనగర్‌కాలనీలో గల బసవేశ్వర కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. అంతకు ముందుగా మహారాష్ట్ర ప్రాంత బెట్‌ముంగ్రా శైవ మఠాధిపతి సిద్దదయాళ్ శివాచార్య, లాతూర్ జిల్లా దహివాడకర్ బార్షి మఠాధిపతి గురుసిద్ధ మణికంఠ శివాచార్య,ఓంకార్ సిద్ద శివాచార్యులు, వీరశైవ సమాజ్ ప్రతినిధులు జ్యోతిప్రజ్వలన చేశారు. వీరశైవ ధర్మ స్థాపకులు రేణుకా పంచాచార్యుల చిత్రపటాలకు పూజలు చేశారు. ఇష్ట శివలింగం, పీఠాధిపతి, జగద్గురువు పాద పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈకార్యక్రమానికి కాశీ పీఠాధిపతి ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. ఏడు కోట్ల వేద మంత్రాల్లో ఓం నమఃశివాయ పంచాక్షరి మహామంత్రం సర్వశ్రేష్ఠమన్నారు. బోధన్‌కు చెందిన వీరభద్ర శివాచార్యులు పూర్వం కాశీ క్షేత్రం పీఠాధిపతిగా సేవలందించారని వివరించారు.బోధన్ ప్రాంతం వీరశైవ ధర్మాన్ని ఆదరించిన పవిత్ర స్థలమన్నారు. బార్షి మఠాధిపతి గురు సిద్ద మణికంఠ శివాచార్య మహారాజ్ ప్రవచనం చేస్తూ బోధన్ అంటేనే బహుధాన్యపురమన్నారు. ప్రతినెల మాస శివరాత్రి పురస్కరించుకుని బోధన్‌లో సామూహిక శివలింగార్చన జరుగుతోందన్నారు. ఈసందర్భంగా మఠాధిపతులను ఘనంగా సన్మానించారు. అన్నప్రసాద వితరణ చేశారు. పట్టణ ,పరిసర గ్రామాల వీరశైవులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీరశైవ సమాజ్ ప్రతినిధులు అజయ్‌వడియార్, వీఆర్‌దేశాయ్, న్యాయవాది శ్యాంరావు, భీంరావు పటేల్, శివకుమార్ అప్పా, కైలాస్ అప్పా, నర్సింగ్ అప్ప,పురాణే అజయ్ కుమార్, యాదవరావు పటేల్, శంకరప్పా, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్,వీరశైవ లింగాయత్ సమాజ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కందారే దిగంబర్‌రావు వేద పండితులు మల్లికార్జున స్వామి, వీరశైవులు గురువులు పాల్గొన్నారు.

పాదయాత్రకు పార్టీ శ్రేణులు తరలిరావాలి

మాక్లూర్ : కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు అన్ని గ్రామాల పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని రఫత్‌ఖాన్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రవిప్రకాష్ మరికొంత మంది సీనియర్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్ర శనివారం జిల్లాలో ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రతి బూత్ అధ్యక్షుడు పది మందితో కలిసి పాదయాత్రకు రావాలన్నారు. మండల సీనియర్ నాయకులు ఎస్ వెంకటేశ్వర్‌రావు, అశోక్, బి దయాకర్‌రావు, రాజు, గోపాల్ నగేష్, పీర్‌సింగ్, గంగారాం పాల్గొన్నారు.

బాల్కొండ : కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు చేపడుతున్న జనహిత పాదయాత్ర విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటన పిలుపు నిచ్చారు.

పెర్కిట్(ఆర్మూర్) : మీనాక్షి నటరాజన్ చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో శుక్రవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఆలూర్ మండల కేంద్రంలోని శివాజీ చౌక్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర సుమారు 10 కిలో మీటర్ల వరకు కొనసాగుతుందన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు శ్రమదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ఈ జీవన్, నాయకులు రాకేష్, మహేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రుద్రూర్: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయాధికారి సాయి కృష్ణ, ఎస్సై సాయన్న తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్‌లు పరిశీలించారు. కాలం చెల్లిన మందులు విక్రయించొద్దని డీలర్లకు సూచించారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు.

అన్నా బావు సాటే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి



రుద్రూర్: ప్రతి గ్రామంలో అన్నా బావు సాటే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్న బావూ సాతే 105వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్న బావూ సాతే సంఘ సంస్కర్తగా, జానపద కవిగా సామాజిక మార్పు కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. దళిత, బడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు హస్గుల్ శ్రీకాంత్, కన్నం సాయిలు, లాలయ్య, శంకర్, గంగారాం, పోశెట్టి, శ్రీకాంత్, రాజు,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా డబుల్‌రోడ్డు నిర్మాణం

- తీరనున్న వాహనదారుల కష్టాలు

వేల్పూర్ : వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామం నుంచి వేల్పూర్‌కు డబుల్‌రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. సుమారు ఐదున్నర కిలోమీటర్లు ఉన్న ఈరోడ్డు నిర్మాణానికి 2023 లో ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ. 8.6 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. తర్వాత సాధారణ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో రహదారి పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం రహదారి పనులు ప్రారంభమయ్యాయి.రోడ్డుకు ఇరువైపులా మట్టితీసి కంకర నింపుతున్నారు.రోడ్డుకు అడ్డుగా వచ్చే చెట్లను తొలగించారు. రోడ్డు పూర్తయితే రెండు గ్రామాలకు చెందిన వ్యవసాయ భూముల్లో తమ పంటల ఉత్పత్తుల రవాణాకు ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది.



అంక్సాపూర్ వేల్పూర్ మధ్య నిర్మిస్తున్న డబుల్‌రోడ్డు

భూములపై విచారణ చేపట్టండి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో లే అవుట్ ప్లాట్ల ఏర్పాటులో జీపీకి కేటాయించిన 10 శాతం భూములపై విచారణ చేపట్టాలని మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ శుక్రవారం తహసీల్దార్ ముజిబొద్దీన్, ఎంపీడీవో గౌస్ మొయినొద్దీన్‌లకు వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ ప్లాట్లలో గుడి, బడికి కేటాయించిన స్థలంపై కూడా విచారణ చేపట్టాలన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూమిని వెలికి తీయాలని కోరారు. గ్రామస్తులు సుభాష్, గంగాధర్, లింగం, సురేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్, తదితరులు

రోస్టర్ పాయింట్ విధానాన్ని రద్దు చేయాలి

రుద్రూర్ : ఎస్సీ రిజర్వేషన్‌లో రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని శుక్రవారం కోటగిరి మండల కేంద్రంలో బాన్సువాడ డివిజన్, కోటగిరి మండల మాల సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాల సంఘం డివిజన్ అధ్యక్షులు మీర్జాపూర్ సాయన్న మాట్లాడుతూ.... ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ ఎస్సీలలో మూడు గ్రూపులుగా విభజించి మాల సామాజిక వర్గం వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఐతే రోస్టర్ పాయింట్ విధానం తీసుకురావడం వల్ల మాల సామాజిక వర్గానికి విద్యా,ఉద్యోగ రంగాల్లో అన్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాల సంఘం డివిజన్ కార్యదర్శులు బ్యాగరి రాములు, పుప్పల సైదయ్య, మోరే జీవన్ కోటగిరి మండల అధ్యక్షులు దండు భూమేష్, ఉపాధ్యక్షులు పాల గంగారాం, కాలే సాయిలు, ఎత్తోండ గంగాధర్, లక్ష్మణ్, విఠల్, మారుతి, ఆవుల గంగారాం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాలసంఘం నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన

రెంజల్(బోధన్): మండలంలోని కూనేపల్లి గ్రామంలో శుక్రవారం పోలీసులు సైబర్ నేరాలపై గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించారు. రెంజల్–2 ఎస్సై రాజు మాట్లాడుతు సెల్ ఫోన్‌లకు ఏపీకే ఫైల్స్ పేరుతో వచ్చిన యాప్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఏఎస్సై గంగాప్రసాద్‌తో పాటు పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుద్రూర్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోటగిరి ఎస్సై సునీల్ అన్నారు. పోతంగల్ మండలం కొడిచర్ల గ్రామంలో శుక్రవారం స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



కూనేపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కమ్మర్‌పల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు కమ్మర్‌పల్లి పోలీసులు అప్పగించారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.చోరీకి గురైన సెల్‌ఫోన్‌లను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ అనిల్‌రెడ్డి బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెర్కిట్(ఆర్మూర్): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సూచించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దోమ కాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ సాయన్న, కరస్పాండెంట్ పట్వారి గోపికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

నవీపేట : మండలంలోని వివిధ గ్రామాలలోని అభివృద్ధి పనులకు ఎంపీ అర్వింద్ నిధులను మంజూరు చేసినట్లు పార్టీ మండల అధ్యక్షులు ద్యాగసరిన్, ప్రధాన కార్యదర్శులు రాజేందర్‌గౌడ్, నీరడి భూషన్‌లు శుక్రవారం తెలిపారు. నవీపేటలోని ధర్యాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ. 3 లక్షలు, బినోల మున్నూరు కాపు సంఘం షెడ్డు నిర్మాణానికి రూ. 3.5 లక్షలు, మోకన్‌పల్లిలోని కేజీబీవీ పాఠశాల సమీపంలో ఎల్‌ఈడీ హై మాస్ట్ లైటింగ్ ఏర్పాటుకు రూ. 1.35లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

బోధన్: నియోజక వర్గం పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.70 లక్షలు మంజూరు చేశారని, పటాన్ చెరువు నుంచి బోధన్ మీదుగా ఆదిలాబాద్ వరకు కొత్త రైల్వే లైన్ మంజూరుకు కృషి చేశారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి గోపికిషన్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి కార్యాలయంలో పార్టీ మండలాల అధ్యక్షులతో కలిసి మాట్లాడారు. పార్టీ మండలాల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, కోల ఇంద్రకరణ్, క్యాతం యోగేష్, రావుభా గంగాధర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వినోద్,నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నీటిని విడుదల చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో ఆర్మూర్ ప్రాంతానికి గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అల్లూరి గంగా రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరిపడా వర్షపాతం నమోదు కాకపోవడంతో ఇప్పటికే సాగు చేస్తున్న మొక్కజొన్న, సోయాబీన్ పంటలు ఎండిపోతున్నాయన్నారు.

ఆయా పోస్టు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో ఆయాగా పనిచేయుటకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీఆర్‌పీ నగేశ్‌గౌడ్ తెలిపారు. నందిపేట గ్రామస్తురాలు అయి ఉండి దివ్యాంగుల తల్లిదండ్రులై ఉండాలన్నారు. ఇంతకు ముందు దివ్యాంగుల పిల్లలకు పని చేసిన అనుభవం ఉండాలన్నారు. 25 నుంచి 60 ఏళ్ల లోపు వారు అర్హులని ఎంపికైన వారికి నెలకు రూ. 3250 వేతనం ఇవ్వబడుతుందన్నారు.

అంగన్‌వాడీ సరుకుల పక్కదారిపై విచారణ

బోధన్: ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాది కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రం నుంచి గురువారం బియ్యం, పప్పు,పాలు, బాలమృతం అక్రమంగా తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే.ఈ సంఘటన పై శుక్రవారం బోధన్ సీడీపీవో పద్మ, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. చిన్నారుల తల్లులతో సమావేశమై మాట్లాడారు. విచారణకు సంబంధించిన విషయాలను వెల్లడించలేదు.

సీపీఎం అగ్రనేతకు ఘన నివాళి

బోధన్: సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జీత్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, డివిజన్ ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. శంకర్‌గౌడ్, పల్లపు వెంకటేశ్, నన్నేసాబ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన అజారి సత్తవ్వ(46) శుక్రవారం అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. భర్త గంగాధర్‌తో గొడవ జరగడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగిరాలేదన్నారు. చుట్టూ పక్కల గ్రామాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. సత్తెవ్వ తమ్ముడు నంగుల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ సంఘ భవనంలో శుక్రవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ పారిశుద్ధ్య కార్మికులు, మహిళ సంఘాల సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రాజు, డాక్టర్ మానస, సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెండా గల్లీలోని జెండా బాలాజీ జాతర నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కాగా శుక్రవారం ఉదయం ఆలయ ఆవరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేదపడింతుడు మధుకర్ శర్మ, మహోహర్ శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల మధ్య స్వామి వారిని కల్యాణం జరిగింది. లక్ష్మీ నామ కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సామూహిక కుంకుమార్చన



నవీపేట: మండలంలోని బినోల గ్రామంలోని కాళికాదేవి ఆలయంలో వేద పండితులు కృష్ణ ప్రసాద్ జోషి ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రావణమాసం మొదలుకొని 41 శుక్రవారాలను కలుపుకొని కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. లోక కల్యాణార్థం ప్రతిఏటా సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

ఆలయం వద్ద శ్రమదానం

రుద్రూర్ : మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద స్థానికులు శుక్రవారం యువకులతో శ్రమదానం చేశారు. శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా స్థానిక యువకులు ఆలయ పరిసరాలను శుభ్రంగా చేశారు. వందల ఏళ్ల నాటి ఆలయం జీర్ణోద్ధారణ అవుతున్నందున నూతనంగా పునః నిర్మాణానికి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల దేవాదాయ శాఖ అధికారులను కలిసినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో దుర్కి అనిల్, పెంట శంకర్ గౌడ్, గాండ్ల భాస్కర్, ఎం. రాములు, సాయిలు, దత్తు, గంగాధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.